క్లుప్తంగా

ఆన్‌లైన్‌లో ఆరోగ్యశ్రీకార్డుల వివరాలు



సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరరావు

సీతానగరం: ప్రభుత్వం పంపిణీ చేసిన ఆరోగ్యశ్రీ కార్డుల వివరాలను వలంటీర్లు నిర్దేశించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. పెదభోగిలిలో సచివాలయాల ఉద్యోగులు, గ్రామ వలంటీర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జె.వెంకటరావు, ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన కల్పించండి

బలిజిపేట: ఓటుహక్కుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఎంఈఓ -1 సామల సింహాచలం అన్నారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఓట్ ఫర్ బెటర్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బలిజిపేట మండలంలో ఓటింగ్ శాతం తక్కువగా ఉన్నందున ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భావి భారతపౌరులుగా ఓటుహక్కు గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో డీటీ రత్నకుమారి, సర్వే డీటీ రమేష్‌నాయుడు, ప్రధానోపాధ్యాయుడు జయప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

సందర్శన



విద్యార్థులతో ఎస్‌సీఈఆర్‌టీ బృంద సభ్యులు

సీతానగరం: లచ్చయ్యపేటలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఎస్‌సీఈఆర్‌టీ ఐబీ బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా బృంద సభ్యులు కేశిరాజు శ్రీనివాస్, మైఖేల్ మాట్లాడుతూ.. బోధనాభ్యసన విధానాన్ని పెంపొందించాలని కోరారు. అనంతరం ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్.శంకరరావు, ఏఎస్ఓ రామకృష్ణ, ఎంఈఓ జి. సూరిదేముడు, లచ్చయ్యపేట హెచ్‌ఎం కె. శంకరరావు, పి. సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు



వెంకంపేటలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురం టౌన్: గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం దోహదపడుతుందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫ్యామిలీ డాక్టర్ కార్యాక్రమంలో భాగంగా ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులను ప్రభుత్వం నియమించిందన్నారు. ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో.. మరొకరు ప్రజల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. 13 రకాల వైద్య సేవలు అందించడంతో పాటు 14 రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే ఎనిమిది రకాల రక్తపరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులు ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందజేస్తున్న అధికారులు

సీతంపేట: స్థానిక భవిత కేంద్రంలో అద్దాల మామిడిగూడకు చెందిన సవర డేవిడ్‌పాల్‌కు అధికారులు వీల్‌చైర్ అందజేవారు. మస్తిష్క పక్షవాతంతో బాధపడుతున్న చిన్నారికి వీల్ చైర్ అందించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎం.ఆనందరావు, సూర్యచంద్రరావు, హెచ్‌ఎం ఎస్.భాస్కరరావు, ఐఈఆర్‌పీ కె.చక్రధర్, వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్ నగరంలో అభివృద్ధి పరుగులు ..

- రూ.45.60 లక్షలతో సచివాలయ భవనం
- రూ.23.94 లక్షలతో ఆర్‌బీకే భవనం
- డీబీటీ ద్వారా ప్రజలకు నేరుగా రూ.12.89 కోట్ల లబ్ధి



రైతు భరోసా కేంద్రం

పార్వతీపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో పాటు విద్య, వైద్యరంగాల బలోపేతానికి నిధులు విడుదల చేస్తుండడంతో గ్రామల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. దీంతో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాయి. మండలంలోని ఎమ్మార్‌నగరంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు నిర్వహించడంతో పాటు సచివాలయ ఉద్యోగులకు అవసరమైన వసతులు కల్పించారు. 45.60 లక్షల రూపాయలతో అన్ని హంగులతో కూడిన సచివాలయ భవనం నిర్మించారు. అలాగే 23.94 లక్షల రూపాయలతో రైతుభరోసా కేంద్ర భవనం నిర్మించారు. స్థానికంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే సంకల్పంతో నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. అదనపు తరగతి భవనాలు నిర్మించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించారు. కార్పొరేట్ పాఠశాలల తరహాలో ఇంగ్లిష్ మీడియం అమలు చేశారు. డిజిటల్ పద్ధతిలో పాఠాలు బోధిస్తుండడంతో విద్యార్థులు చదువుపై మక్కువ కనబరుస్తున్నారు. సొంతిళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పొచ్చు. రూ. 25 లక్షల జేజేఎం నిధులతో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించారు. అలాగే గ్రామంలో గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి రూ.8 లక్షలు, మంచినీటి కోనేరు అభివృద్ధికి అమృత్ సరోవర్ పథకం ద్వారా రూ.8 లక్షలు, గ్రామంలో రచ్చబండ నిర్మాణానికి రూ. 3 లక్షలు కేటాయించారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు పూర్తి స్థాయిలో విడుదల కావడంతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.



గ్రామంలో నిర్మించిన రోడ్డు



గ్రామ సచివాలయ భవనం

రోడ్లు, కాలువ పనులకు ప్రాధాన్యం

ప్రభుత్వం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి గ్రామస్తులు పలు సమస్యలు తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి రూ.3.30 లక్షలతో సీసీ కాలువ, రోడ్డు పనులు చేపట్టారు. అలాగే మరో 15 లక్షల రూపాయలతో గ్రామంలో సీసీ రోడ్లు వేయించారు.



నాడు-నేడు పనుల్లో భాగంగా నిర్మిస్తున్న పాఠశాల భవనం

జగనన్నతోనే అభివృద్ధి..



గ్రామం ఇంతలా అభివృద్ధి చెందిందంటే అది కేవలం జగనన్న వల్లే. గతంలో ఎన్నో ప్రభుత్వాలు పాలించినా మా గ్రామాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదు. గ్రామంలో రోడ్లు, డ్రెయిన్లు, సచివాలయ భవనం, ఆర్‌బీకేల నిర్మాణం వంటివి చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి చేశారు.

– రామారావు, ఎంపీటీసీ సభ్యుడు, ఎమ్మార్‌నగరం

గ్రామాన్ని అభివృద్ధి చేశాం..



గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశాం. సచివాలయ భవన నిర్మాణానికి రూ. 45.60 లక్షలు, ఆర్‌బీకే భవనానికి రూ.23.94 లక్షలు మంజూరయ్యాయి. గ్రామంలో అన్ని పథకాలను వలంటీర్లు నేరుగా ప్రజలకే అందజేస్తున్నారు.

– వంగపండు లక్ష్మి, సర్పంచ్, ఎమ్మార్‌నగరం

వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
జగనన్న అమ్మఒడి	505	రూ. 4.78 కోట్లు
జగన్న విద్యాదీవెన	180	రూ. 39.95 లక్షలు
జగనన్న వసతిదీవెన	137	రూ. 22.24 లక్షలు
వైఎస్సార్ రైతుభరోసా	310	రూ. 1.33 కోట్లు
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	30	రూ. 15 వేలు
వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు	59	రూ. 99 వేలు
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	567	రూ. 99.55 లక్షలు
వైఎస్సార్ చేయూత	122	రూ. 3కోట్లు
వైఎస్సార్ ఆసరా	210	రూ.14.91 లక్షలు
వైఎస్సార్ సున్నా వడ్డీ	751	రూ. 8.39 లక్షలు
వైఎస్సార్ కాపునేస్తం	8	రూ. 2.25 లక్షలు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	22	రూ. 9 లక్షలు
వైఎస్సార్ కల్యాణమస్తు	147	రూ. 43.35 లక్షలు
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	210	రూ. 20.80 లక్షలు
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	82	రూ. 5.40 లక్షలు
హౌసింగ్ చెల్లింపులు	8	రూ. 12.30 లక్షలు
వైఎస్సార్‌బీమా	121	రూ. 1.68 కోట్లు
వైఎస్సార్ వాహనమిత్ర	1	రూ. 20 వేలు
వైఎస్సార్ నేతన్న నేస్తం	19	రూ. 5.90 లక్షలు
జగనన్న చేదోడు	49	రూ. 9.90 లక్షలు
కోవిడ్ ప్రత్యేక సాయం	686	రూ.6.86 లక్షలు
నాన్ డీబీటీ ప్రయోజనాలు		
ఇంటి స్థలాలు	38	రూ. 5.20లక్షలు
జగనన్న విద్యాకానుక కిట్లు	278	రూ. 1.31 కోట్లు
ట్యాబ్‌లు	71	రూ.13.21లక్షలు
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	162	రూ. 30.34 లక్షలు
ఇంటింటికి రేషన్	681	రూ. 1.48 కోట్లు

నెరవేరిన సొంతింటి కల



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 23,24 వార్డులకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఎంపిక చేసిన జగనన్న లేఅవుట్ రద్దు కావడంతో లబ్ధిదారులకు వెంకంపేట ప్రాంతంలో మరో లే అవుట్ వేసి స్థలాలు కేటాయించామన్నారు. ఎన్నో ఏళ్లనాటి కలను నిజం చేసిన జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని సూచించారు.

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ మంత్రి ఉమామహేశ్వరి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ గొర్లి మాధవరావు, కన్వీనర్లు ఆకుల శ్రీనివాసరావు, గృహసారథులు, కార్యకర్తలు, వలంటీర్లు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యం..

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
- వసతిగృహాల్లో వంటగది, డైనింగ్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

సాలూరు రూరల్: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని కొత్తవలస బాలికల వసతిగృహంలో రూ.2.75 కోట్లతో చేపట్టనున్న వంటగది, డైనింగ్ హాల్ అదనపు గదుల నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే అంటివలస బాలుర వసతిగృహంలో రూ.50 లక్షలతో డైనింగ్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం బాగులేకపోతే వెంటనే ఉపాధ్యాయులకు చెప్పాలని, వారు వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలు అందేలా చూస్తారన్నారు. అంతేకాని తల్లిదండ్రులు వచ్చారని ఇంటికి వెళ్లిపోవద్దని సూచించారు. ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలన్నారు. తాను కూడా ఇలాంటి హాస్టల్‌లోనే ఉండి చదువుకున్నానని, అప్పట్లో ఇన్ని సౌకర్యాలు లేవని అన్నారు. విదేశాల్లో చదువుకోవాలనుకునే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వం రూ.50 లక్షల నుంచి రూ.1.50 కోట్ల వరకు ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఏ సమస్య ఉన్నా ఉపాధ్యాయులకు తెలియజేయాలని, వారు పరిష్కరించకపోతే నావద్దకు వస్తే వెంటనే మీ సమస్యను పరిష్కరిస్తానన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలకు జగనన్న ప్రభుత్వం పదోన్నతులు కల్పిస్తుందన్నారు. ఖాళీల భర్తీకి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జిల్లా ఏఎంసీ చైర్మన్ దండి అనంతకుమారి, గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ, వైఎస్సార్‌సీపీ నాయకులు సువ్వాడ రామకృష్ణ, దండి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీనివాస్, పెద్దింటి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

బలిజిపేట:

మండలంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండు కేంద్రాలలో 287 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ప్రైవేట్ కళాశాలలో కూడా పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 257 మందికి గాను 240 మంది.. ప్రైవేట్ కళాశాలలో 50 మందికి గాను 47 మంది హాజరయ్యారు.

మక్కువ: ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు మండలం నుంచి 420 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 395 మంది పరీక్షలు రాశారు. 25 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణను చీఫ్ సూపరింటెండెంట్ వాసుబాబు పర్యవేక్షించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని వెంగళరాయపురంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నేరుగా మహిళల ఖాతాల్లోకి సంక్షేమ పథకాల డబ్బును జమ చేస్తోందని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి జగనన్న పాలన సాగిస్తున్నారని చెప్పారు. మధ్యవర్తులు, దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కరోనా సమయంలోనూ ప్రజలకు వైద్య సేవలు అందించడం, సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా అండగా నిలవడం గొప్ప విషయమని చెప్పారు. గతంలో ఎటువంటి సంక్షేమాన్ని అమలు చేయని నాయకులు మాయమాటలతో ప్రజలను మోసం చేయడానికి మరోసారి వస్తున్నారని, వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినవన్నీ చేసిందని, మరోసారి ఆశీర్వదిస్తే సంక్షేమం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు జి.పకీరునాయుడు, జి.సత్యంనాయుడు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు ఎ.రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల వ్యవసాయ సలహా సంఘ అధ్యక్షుడు గంగయ్య, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

'పల్స్‌పోలియోను విజయవంతం చేయండి'



మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ

సీతానగరం: పోలియో రహిత సమాజ స్థాపనలో అందరూ భాగస్వాములు కావాలని పీహెచ్‌సీ డాక్టర్ పావని అన్నారు. మూడో తేదీన నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి సంబంధించి మండల కేంద్రంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ పావని మాట్లాడుతూ, పోలియోరహిత సమాజ స్థాపనకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అప్పుడే పుట్టిన పసికందు నుంచి 5 సంవత్సరాల్లోపున్న చిన్నారులకు చుక్కల మందు వేయాలని సూచించారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి గ్రామాల్లోని రామమందిరాలు, రచ్చబండలు, బస్టాండ్‌లు, ముఖ్య కూడళ్ల వద్ద బూత్‌లు ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపరువైజర్ శర్మ, పీహెచ్‌ఎన్ సత్యవతి, హెచ్‌వీ కె. భవాని, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి..

పెదంకలాం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఆదివారం నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాలను విజయవంతం చేయాలని పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్ పిలుపునిచ్చారు. స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్యశాఖ సిబ్బందితో సమావేశమై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జి. సూర్యనారాయణ, హెల్త్‌సూపరువైజర్లు ఏఎన్‌ఎంలు, ఆశాలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తంచన్‌గా పింఛన్...



బలిజిపేట: పెదపెంకిలో పింఛను అందిస్తున్న ఎంపీపీ నాగమణి



బలిజిపేట: వంతరాంలో పింఛను సొమ్ము అందజేస్తున్న మండల ఉపాధ్యక్షురాలు బి.హేమలత

బలిజిపేట: జగనన్న ప్రభుత్వంలో నిరుపేదల సంక్షేమ పథకాలు తంచన్‌గా అమలవుతున్నాయని ఎంపీపీ నాగమణి తెలిపారు. మండలంలోని 20 సచివాలయాల పరిధిలో శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా పెదపెంకిలో ఎంపీపీ నాగమణి.. వంతరాంలో మండల ఉపాధ్యక్షురాలు బి.హేమలత ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, నిరుపేదలకు సంక్షేమ పథకాలు వరంలా మారాయన్నారు.

పండగ వాతావరణంలో..

సీతానగరం: మండల పరిధిలో వలంటీర్లు పండుగ వాతావరణంలో పింఛన్లు పంపిణీ చేశారు. పెదబోగిలిలో గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్ సురగాల కిరణ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకుడు ఇజ్జాడ సింహాచలం ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. అప్పయ్యపేటలో గ్రామ పెద్దలు బి. సూర్యనారాయణ, గొర్జ లక్షున్నాయుడు, సబ్బాన ఆనందరావు ఆధ్వర్యంలో.. కోటసీతారాంపురంలో సర్పంచ్ యు. విజయలక్ష్మి, సచివాలయ కన్వీనరు వెంకటనాయుడు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు.



సీతానగరం: పెదబోగిలిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కిరణ్‌కుమార్, ఇజ్జాడ సింహాచలం.



సీతానగరం: కేఎస్ పురంలో వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనరు వెంకటినాయుడు